ఆవేదన ప్రవాహంలా పొంగిపొర్లాయి. రాఘవకు నోట మాటరాలేదు. మనసు మొద్దు బారినట్టయింది. అందమైన వల... తనను ఏదో ఆహ్వానిస్తూన్నట్టనిపించింది.

పడుపు వృత్తిలోని ఒక ఆడదాని చెల్లెల్ని కావాలని పెళ్ళి చేసుకోవడమా ? ఇది వీలవుతుందా? నో... తన వాళ్లెవరూ ఒప్పుకోరు. అయినా తను చేసిన సహాయానికి ఇటువంటి కోరిక కోరుతుందని ముందుగా వూహించ లేకపోయాడు. ఆమె ఆశ పడటంలో న్యాయం ఉంటే ఉండొచ్చు... కాక, తనకు అదెలా సాధ్యపడుతుంది ? ఆ రోజు ఏభై రూపాయలు ఎడ్వాన్సుగా ఇవ్వబోతే వద్దని నిరాకరించింది ఇందుకేనా ?

"సారీ ! ఈ విషయంలో ఆలోచించుకోవడానికి నాకు కొంత వ్యవధి కావాలి." రాఘవ తలవంచుకుని గదిలోంచి చరచరా బయటికి వెళ్ళిపోయాడు. నడుస్తూన్న బొమ్మలా ఆమె గుమ్మం దగ్గరకొచ్చి అతడు వీధి చివరకు వెళ్ళేవరకు అలా చూస్తూనే నిలబడింది. కనీసం రాఘవ వెనక్కి తిరిగిచూడలేదు. పతంజలి పెదాలపై పేలవమైన చిరునవ్వొకటి వెలిగి ఆరిపోయింది. ఆ నవ్వులో వేనవేల భావాలు... నువ్వూ మామూలు మనిషివే ! మగాడివే! ఆమె అనుకోకుండా ఉండలేకపోయింది. ధడాలున తలుపులు మూసి గడియవేసుకుంది.

రాఘవ రాజమండ్రిలో ఉద్యోగంలో జాయినయి అప్పుడే నెలరోజులు దాటాయి. మొదటి నెల జీతం కూడా అందుకున్నాడు. అతని జీవితం ఇప్పుడు సాఫీగా, ఆనందంగా సాగిపోతుంది. దూరపు, దగ్గర బంధువులప్పుడే రాఘవకు రెండు మూడు పెళ్ళి సంబంధాలు కూడా తీసుకు వచ్చారు. అతని రేటు ఇప్పుడు ఏభై వేలు దాటి పలుకుతూంది. పెళ్ళి చేసుకోడటానికి రాఘవ సిద్ధంగా ఉన్నాడు. మొదటి నెల జీతం అందుకోగానే అంజలికి జీతంలో సగం సొమ్ము పంపించాలనే విషయం జ్ఞాపకం వచ్చినా, దానికంత ప్రాధాన్యం ఇవ్వలేకపోయాడు. ఉద్యోగం వచ్చిన కొత్త వాతావరణంలో, స్నేహితుల సంరంభంలో, బంధువుల హడావుడిలో అతను మామూలుగా మునిగిపోయాడు.

ఆ రోజు ఆఫీసునుండి బయటపడిన రాఘవ రోడ్డుమీద నడుస్తున్నాడు. సాయంకాలం మనోల్లాసంగా ఉంది. అందమైన జంటలు ఎన్నో రోడ్డుమీద ఆనందం అంతా తమ ఒక్కరి సొత్తేనన్నట్లుగా నడిచిపోతున్నాయి. సమయం ఆరు గంటలయ్యింది. రాఘవ అప్సరాలో టిఫిన్ చేసి కాఫీ త్రాగి బయటపడ్డాడు. కిళ్ళీ కొట్టుముందు నిలబడి తీసుకున్న సిగరెట్‌కు డబ్బులివ్వబోతుంటే పర్సులోంచి ఓ చీటీ క్రిందపడింది. ఆశ్చర్యంగా ఒంగి చీటీ తీసి చదివాడు. అది... ఆరోజు అంజలి... చేతికిచ్చిన తన వాళ్ళ ఎడ్రసు. సిగరెట్ వెలిగించి రోడ్డు మీద నడుస్తూ ఆలోచనలో పడ్డాడు రాఘవ.

అంజలి రూపం కళ్ళ ముందు కదిలింది. ఆమె చేసిన సహాయమూ మనసులో మెదిలింది. అవును. అవును. అంజలి తన అంతరంగాన్ని అప్పుడప్పుడూ కుదుపుతూనే ఉంది. తను వాగ్దానం చేసిన డబ్బు ఎలాగైనా ఆమెకు పంపించాలి. వెంటనే ఒదిలించుకోవాలి. లేకపోతే మనసులో ఏదో గిల్టీ... తప్పుచేసిన భావం... పోనీ ఒకసారి ఈ ఎడ్రసుకు వెళ్ళి చూసివస్తే తప్పేముంది ? సరదాగా ఆవీధికి వెళ్ళి... వీలయితే ఆ అమ్మాయిని చూసి వాళ్ళ స్థితిగతులు గమనించి వచ్చేయొచ్చు. తనిప్పుడు ఇంటికి వెళ్ళి చేసేపని ఏమీ లేదు కదా !.

ఆలోచన రావడమే తరువాయి రాఘవ ఓ రిక్షాను పిలిచి అందులో ఎక్కి కూర్చున్నాడు. ఎడ్రసు ప్రకారం జాంపేట పోనిమ్మన్నాడు. రిక్షా మలుపు తిరిగి ముందుకు పరుగెట్టింది.

తిన్నగా ఇంటికి వెళితే మీరెవరు ! అని వాళ్ళంతా అడగొచ్చు జవాబు ఏం చెప్పాలి ? ఆ వీధిలో ఎక్కడయినా ఆగి నెమ్మదిగా ఆ ఇంటిని కనుక్కొని ఆ అమ్మాయిని చూసి మొత్తం సమాచారం సేకరించాలి... అంతే !

రాఘవ చెప్పిన ప్రకారం జాంపేటలో వినాయకుడి వీధి ముందు రిక్షా ఆగింది. రిక్షావాడికి

డబ్బులిచ్చి పంపించి వేసి రాఘవ ఆ వీధిలోకి అడుగుపెట్టాడు వీధి చివర ఎవరిదో పెళ్ళిలా ఉంది. ఇంటి ముందు పందిరి... రంగు రంగుల దీపాలు, పందిరి చుట్టూ జనం. మ్రోగుతున్న బాండు మేళాలు, కన్నుల పండువుగా ఉంది. రాఘవ మరో సిగరెట్ వెలిగించి వినాయకుడి గుడి ముందు ఆగాడు. గదిలోంచి పూజారి అర్చన ముగించి అప్పుడే బయటికి వస్తున్నాడు. అక్కడే నిలబడ్డ రాఘవని చూసి 'ఎవరు బాబూ ? ఏం కావాలి ?' అంటూ ప్రశ్నించాడు. సిహెచ్. సీతారామయ్య గారని... తెలుగు మాస్టారిల్లు... రాఘవ అర్థోక్తిగా అడిగాడు.

"అదే బాబూ... ఆ పెళ్ళి జరుగుతూంది చూడండి - అదే సీతారామయ్యగారిల్లు. సీతా రామయ్య గారి అమ్మాయి. పరిమళమ్మకే పెళ్ళి ! వెళ్ళండి, బాబూ ! వెళ్ళండి !" పూజారి కంగారుగా వెళ్ళిపోయాడు. రాఘవ తుళ్ళిపడ్డాడు.

తను పొరపాటుగా వినలేదు గదా ! సీతారామయ్య కూతురు పరిమళకు పెళ్ళా ? విచిత్రంగా ఉందే ! ఇక సమస్యే లేదు. అంజలి మనసులోని కోరిక... చెల్లెలు పరిమళకు పెళ్ళి జరగడం! అది జరిగిపోతూనే ఉంది. కాగల కార్యం కావలసిన వాళ్ళే తీరుస్తున్నారు.

రాఘవ గబగబా పెళ్ళి పందిట్లోకి నడిచాడు. పీటల మీద పెళ్ళి కొడుకు ఠీవిగా కనిపించాడు. పెళ్ళికూతుర్ని ముత్తైదువులు అప్పుడే లోపల్నుంచి పందిట్లోకి తీసుకొస్తున్నారు. పరిమళ సన్నగా తీగెలా ఉంది. ముఖంలో అంజలి పోలికలు కొట్టొచ్చినట్టుగా కనబడుతున్నాయి.

'ఆగండి ! ఈ పెళ్ళి జరగటానికి వీల్లేదు !' పెళ్ళి పందిట్లో పిడుగు పడినట్లు వినబడిందాకేక పెళ్ళి కొడుకు తండ్రో, మరి బంధువో పెళ్ళికొడుకుని రెక్క బట్టుకుని పైకి లేపేశాబు. బాండు మేళం ఆగిపోయింది. ఎవరికి వాళ్ళే బొమ్మల్లా నిలబడి పోయారు.

"సీతారామయ్యగారూ ! మీరింత మోసం చేస్తారనుకోలేదు. పెళ్ళి కూతురు అక్క... అదే మీ పెద్ద కూతురు ఇల్లు వదిలి ఎవడితోనో పోయిందన్న మాట నిజమా, అబద్ధమా ? మా కంతా తెలిసింది. విషయాన్ని కప్పిపుచ్చి గప్‌చిప్‌గా పెళ్ళి చేసేద్దామను కున్నారు ! మాకు ఈ అమ్మాయి ఒక్కత్తే అని మళ్ళీ అబద్దాలు చెప్పారు. నిప్పులాంటి వంశం మాది. ఛీ ! ఛీ ! నడవండ్రా ! నడవండి. ఈ పెళ్ళీ వద్దు. సంబంధం వద్దు !"

ఆ పెళ్ళి పెద్ద ఆగ్రహాన్ని కురిపిస్తూ పెళ్ళికొడుకుని తీసుకుని బయటికి వెళ్ళిపోయాడు. పెళ్ళి పందిరంతా తెల్లబోయింది. పెళ్ళికూతురు తండ్రి సీతారామయ్య ముఖంలో నెత్తురు చుక్కలేదు. ఎవరికి వాళ్ళే గుసగుసలు.

సీతారామయ్య పరుగు లాంటి నడకతో పెళ్ళి ఆ పెళ్ళి పెద్ద రెండు చేతులు పట్టుకున్నాడు. ఏడుపులాంటి స్వరంతో బ్రతిమాలుతూ -- "నన్ను క్షమించండి, బావగారూ ! మీ కాళ్ళు పట్టుకుంటాను. నా కూతురుకు అన్యాయం చేయకండి. నా పెద్ద కూతురు లేచిపోయిందో, చచ్చిపోయిందో నిజంగా నాకు తెలియదు. దానికెప్పుడో ఇన్ని నీళ్ళు వదిలేశాను. బాగారూ !"

ప్రేక్షకుడిగా చూస్తూన్న రాఘవ నిర్ఘాంత పోయాడు. అతడి మెదడు నిండా హోరు. నర, నరాల్లో తీవ్ర సంచలనం.

పెళ్ళి కూతురు పరిమళ అవమానంతో, దుఃఖంతో కుంచించుకుపోయి లోపలికెళ్ళిపోయింది. పెళ్ళి కూతురు తల్లి కొంగు అడ్డం పెట్టుకుని కుమిలి కుమిలి విలపిస్తోంది. ఆడపెళ్ళి వారందరూ కలిసి మగ పెళ్ళివారికి తలొక విధంగా నచ్చ చెబుతున్నారు. పెళ్ళికొడుకు అయోమయంగా ఉండిపోయాడు. చివరకు మగపెళ్ళివారు పెళ్ళిరద్దుచేసుకుని వెళ్ళిపోవడానికే ఉద్యుక్తులయి పోతున్నారు.

పచ్చని పందిట్లో పెళ్ళి ఆగిపోయింది. ఒక చెడిన ఆడది అంజలి కారణంగా ఈ పెళ్ళి చెడిపోయిం ది. ఒక కుటుంబం పరువు, ప్రతిష్ట

ఆత్మాభిమానం అన్నీ ఆత్మహత్య చేసుకోబోతున్నాయి. ఒక కన్నెమనసు కన్న కలలన్నీ కొడిగట్టిన దీపాల్లా మసిబారబోతున్నాయి. అదే చెడిన ఆడది కారణంగా తనకు ఉద్యోగం వచ్చింది. తన జీవితానికో ఉపాధి దొరికింది. దరిద్రంలో కొట్టుమిట్లాడే తన కుటుంబానికి జీవం వచ్చి ధైర్యంగా నిలబడింది. రాఘవ మస్తిష్కంలో సంకుల సమరం.

నేను చేసిన తప్పుకు నా చెల్లెలు శిక్ష అనుభవిస్తూంది. నా కుటుంబం అంతా జీవచ్ఛవాల్లా బతుకుతున్నారు... అంజలి దీనారావం. ఆవేదన రాఘవ చెవుల్లో గింగురుమంటున్నాయి

"ఈ పందిట్లోని పెద్దలంతా దయచేసి ఒకసారి నా మాట వినండి. నా పేరు రాఘవ. మీరంతా ఎవరితోనో లేచిపోయిందనుకుంటున్న అంజలి అదే పెళ్ళి కూతురు అక్కకు తాళి కట్టిన భర్తను నేను. అవును అంజలి చెడిపోలేదు. ఎవరితోనూ లేచిపోలేదు. మేమిద్దరం ప్రేమించి పెళ్ళి చేసుకున్నాం. ఇంతకాలం భయంతోనూ, బాధలతోనూ నాకు ఉద్యోగం దొరక్కపోవడం వల్లనూ ఎవరికీ కనిపించలేక అజ్ఞాతంగా బతికాం!'

పందిట్లోని జనం అంతా రాఘవను ఆశ్చర్యంగా... కొత్తగా... వింతగా... ఎవరికి వాళ్ళు నిశ్చేష్టులై చూశారు. మగపెళ్ళివారి ముఖాలు కొన్ని నమ్మలేనట్లుగా అనుమానంగా చూశాయి.

"నిజం ! నా మాటను నమ్మండి ! అంజలి సిగ్గుతోనూ, భయంతోనూ ఈ పెళ్ళికి రాలేక పోయింది. మరదలి పెళ్ళికి వెళ్ళమని ప్రోత్సహించి పట్టుదలగా నన్ను పంపించింది. కావాలంటే నా భార్యని రేపు ప్రొద్దుటకే తీసుకొచ్చి మీ అందరకూ చూపిస్తాను. దయచేసి ఈ పెళ్ళి జరగనివ్వండి. ప్లీజ్ !"

రాఘవ పెళ్ళికొడుకు తండ్రిని, పెళ్ళికొడుకుని బ్రతిమాలి మళ్ళీ పెళ్ళి పందిట్లోకి తీసుకొచ్చాడు. అందరి ముఖాలు ప్రసన్నమయ్యాయి. ఆనందం వెల్లివిరిసింది. సీతారామయ్య వచ్చి అమాంతం రాఘవను కౌగిలించుకుని కన్నీళ్ళు పెట్టుకున్నాడు. పెళ్ళి పందిట్లో మళ్ళీ బాండు మేళం మ్రోగింది.

పెళ్ళి పందిట్లో కొత్త దంపతులపై అక్షింతలు వేసి బయటకు వచ్చాడు రాఘవ. అతని మనసిప్పుడు స్వచ్ఛంగా, చల్లగా ఉంది. బయట వెన్నెల్లా హాయిగా, ప్రశాంతంగా ఉంది. వాళ్ళందరి ముందు తనెంతో ఉన్నతంగా ఎదిగి... ఎవరెస్టు శిఖరాన్నెక్కి కూర్చున్నంత సంబరంగా ఉంది.

తన నిరుద్యోగ జీవితంలో నిస్వార్థంగా నిండు వెన్నెల పూయించిన అంజలికి తన మనోసంస్కారాన్ని, కృతజ్ఞతనూ అభిషేకం చేస్తూ ఆమెను తన బ్రతుకులో భాగస్వామిగా తెచ్చుకోవడానికి బయలు దేరాడు రాఘవ.

అతను అందరి ముందు పందిట్లో పలికిన అందమైన అబద్ధం... నిజం కాబోతూందన్న ఆనందంతో ఆకాశంలో చంద్రుడు వెన్నెల వర్షంతో ఆ రాత్రిని 'మహాభిషేకం' చేస్తున్నాడు.

ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక
ఉగాది సంచిక 4-4-84